నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
3 | శుక్రవారం 31 మే 2024 | MAHABUBABAD

### తోరణాలను కాపాడుకుందాం..



ఎన్ని ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా కాలానికి ఎదురునిలబడింది కాకతీయ తోరణం. 900 సంవత్సరాల క్రితం గణపతి దేవుడు రెండు, రాణీరుద్రమ దేవి రెండు తోరణాలు ప్రారంభించగా, ఆ తర్వాత ఖిలా వరంగల్ ఉండే స్వయంభూ దేవాలయాల్లో నాలుగు దిక్కులుగా నాలుగు మిడ్ పాయింట్లలో ఏర్పాటు చేశారు. హనుమకొండ కోట ప్రవేశద్వారం అగ్గిలయ్య, సిద్ధమయ్యగుట్ట, కొలనుపాక, ఐనవోలు ఎంట్రెన్స్ వద్ద ఏర్పాటు చేశారు. 1970కి ముందు ఢిల్లీ సుల్తాన్‌లు అన్ని దేవాలయాలను ధ్వంసం చేసినా కాకతీయ తోరణాలను మాత్రం వదిలేశారు. ప్రపంచవ్యాప్తంగా కాకతీయ తోరణానికి గుర్తింపు ఉంది. 1945లో పోస్టల్ స్టాంప్‌పై ముద్రించారు. 1975లో ప్రపంచ తెలుగు మహాసభను ఈ లోగోతో నిర్వహించారు. 297 సంవత్సరాలు పాలించిన కాకతీయులు ఒక్క ఇల్లు కూడా కట్టుకోలేదు. కానీ ప్రజల సౌకర్యం కోసం చెరువులు కట్టించారు. కాకతీయుల ఖ్యాతికి భంగం కల్గించవద్దు. సూర్యుడు, చంద్రుడు ఎన్నేళ్లు ఉంటారో తెలంగాణలో ఉండే ప్రతి ఖ్యాతి అంతే. తుగ్లక్ ఏడుసార్లు వరంగల్‌పై దాడి చేసినా కాకతీయుల తోరణాలను ముట్టుకోకుండా వదిలేశాడు.

– అరవింద్ ఆర్య, టార్చ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు

### సంపదను కాపాడుకోవాలి



సాహితీసంపదను కాపాడుకోవాలి. కాకతీయుల తోరణాన్ని రాజముద్ర నుంచి తొలగిస్తామంటే తీవ్రమైన బాధేస్తోంది. ఎందుకు తొలగిస్తున్నారు?, ఇగో కావచ్చు, వరంగల్ అంటేనే కాకతీయ కళాతోరణం. రాష్ట్రం పరువు తీస్తున్నారు. కళాకారులు, కవులు, మేధావులు, సంగీత కళాకారులు రాష్ట్రంలో చాలా మంది ఉన్నారు. చరిత్రకారులను సంప్రదించకుండా పాట మారుస్తామనడం సరికాదు. పిల్లల ఆటలా ఉంది. మేధావులు, కవులు, కళాకారులు దీన్ని తీవ్రంగా ఖండించాలి. రాజముద్ర నుంచి కాకతీయ తోరణం తీసేయకుండా చూడాలి.

– అభిషేక్, అన్నమాచార్య ఫౌండేషన్ చైర్మన్



# చరిత్ర గుర్తులు చెరిపేసేలా..




మేధావుల సదస్సులో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

## కాకతీయుల కీర్తి ప్రతిష్ట కళాతోరణం

- వెయ్యేండ్ల సాంస్కృతిక వైభవానికి చిహ్నం
- రాజముద్ర నుంచి దాన్ని తొలగించడం సరైంది కాదు
- 'టార్చ్' సదస్సులో మేధావుల చర్చ
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు

*'వెయ్యేండ్ల సాంస్కృతికి వైభవమైన కాకతీయ కీర్తి తోరణం, చార్మినార్‌ను తెలంగాణ అధికారిక చిహ్నం నుంచి తొలగించి చరిత్రను చెరిపేసే కుట్ర జరుగుతున్నది. వీటిని తీసివేయడం ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉంది. ఇందులో తేడా వస్తే ప్రజలు ఊరుకోరు. మార్పులు, చేర్పులు ఆమోద యోగ్యంగా ఉండాలి. రాజముద్రలో ఇంకా ఏమైనా అదనంగా ఏర్పాటు చేసుకోవచ్చు కానీ, ఉన్నవాటిని తీసేయడం సరి కాదు. అదేవిధంగా కళాకారులు, కవులు, మేధావులు, సంగీత కళాకారులకు రాష్ట్రంలో కొదువ లేదు. వీరందరినీ సంప్రదించకుండా పాట మారుస్తామనడం పిల్లల ఆటలా ఉంది. దీన్ని తీవ్రంగా ఖండించాలి' అని గురువారం హనుమకొండలోని కాకతీయ హరిత హోటల్‌లో టార్చ్(టీం ఆఫ్ రిసెర్చ్ కల్చర్ అండ్ హెరిటేజ్) ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మేధావులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన సంస్కృతి, చరిత్రకు ప్రాధాన్యమిచ్చి రూపొందించిన ఈ చిహ్నన్ని మార్చాలనుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. అధికారంలో ఉన్నామని మార్చుకుంటూ పోతే తెలంగాణ చరిత్రకే మాయనిమచ్చగా మిగులుతుందని పేర్కొన్నారు.*

– హనుమకొండ చౌరస్తా, మే 30

### వరంగల్ అంటేనే తోరణం..



కాకతీయ తోరణానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. హైదరాబాద్ అంటే చార్మినార్. దానికి 500 ఏళ్ల చరిత్ర ఉంది. వరంగల్ అంటేనే కాకతీయుల తోరణం. వాటిని రాజముద్ర నుంచి తొలగిస్తామనడం సరైంది కాదు. తెలంగాణలోని మేధావులు మేధోమథనం చేయాల్సిన అవసరం ఉంది.

– ప్రేరణి అశోక్

### సంస్కృతికి చిహ్నం..



సంస్కృతికి చిహ్నం కాకతీయుల కళాతోరణం. దాన్ని రాజముద్ర నుంచి తీస్తేసే భవిష్యత్‌లో చరిత్ర మరిచిపోతారు. వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది. నెపోలియన్, హిట్లర్, లెనిన్ వివేకవంతమైన పాలకులకు హిస్టరీ తెలియదు. చరిత్ర తెలిస్తేనే గతాన్ని మనం మార్చలేం. చరిత్రను స్ఫూర్తిగా తీసుకుని మంచిగా నిర్మించుకునేలా కాకతీయులు సేవలందించారు. కాకతీయ రాజులు చెరువులు, గుళ్లు, వారి నగరాలను సర్వకళలతో రూపొందించారు. రామప్పకు యునెస్కో గుర్తింపు వచ్చేలా నిర్మించారు. సంస్కృతికి చిహ్నమైన కళా తోరణం రాజముద్రలో తప్పనిసరిగా ఉండాలి. వెయ్యి పేజీల వారసత్వ సంపద అనుకోవాలి. కళా తోరణాన్ని తొలగించడాన్ని అందరూ ముక్తకంఠంతో ఖండించాలి.

– విజయబాబు, కేయూ హిస్టరీ ప్రొఫెసర్

## రేవంత్‌రెడ్డిది తుగ్లక్ నిర్ణయం

- మంత్రులు సురేఖ, సీతక్క వ్యతిరేకించపోవడం సిగ్గుచేటు
- బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

కాకతీయ తోరణం, చార్మినార్ లోగోలను తొలగిస్తామనడం తుగ్లక్ నిర్ణయమని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మండిపడ్డారు. చరిత్రపై అవగాహన లేని పాలకుడు రేవంత్‌రెడ్డి అని, ఆ పిచ్చి ఆలోచన మానుకోవాలన్నారు. కాకతీయ తోరణం, చార్మినార్ లోగోను రాజము ద్ర నుంచి తొలగిస్తామంటే మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కాంగ్రెస్‌వాదులంతా లోగోను ఆమోదిస్తుంటే రేవంత్‌రెడ్డి మాత్రం మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని, ఇది ఆ పార్టీ నిర్ణయంగా భావించడం లేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకోని వ్యక్తి.. చరిత్రను రూపుమాపాలని చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమైక్యవాదులకు రేవంత్‌రెడ్డి తొత్తుగా మారాడని, సరిహద్దులను మార్చేసి సమైక్యాంధ్రలో కలుపుతాడన్నారు. చరిత్ర గుర్తులను తొలగిస్తుంటే వరంగల్ జిల్లాలోని మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క వ్యతిరేకించపోవడం సిగ్గుచేటన్నారు. ఈ లోగో తీసేస్తే ప్రజల మదిలో నుంచి కేసీఆర్‌ను దూరం చేయొచ్చనే ఆలోచనతో ఉన్నట్లు భావిస్తున్నామన్నారు. కాకతీయ కళాతోరణాన్ని తీసేస్తే చరిత్రను తీసేసిన ద్రోహులుగా మిగిలిపోతారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాకతీయ కళా తోరణాన్ని అధికారిక చిహ్నం నుంచి తొలగిస్తే మరోసారి దశలవారీగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి నిర్ణయానికి నిరసనగా నేడు ఉదయం 11 గంటలకు కాళోజీ సెంటర్‌లో మానవహారం చేయనున్నట్లు తెలిపారు. కాకతీయ లోగో సృష్టికర్త అశోక్, సప్తతి రణధీర్, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ రామ్మూర్తి, జాగృతి నాయకులు సుశీల్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, శ్రవణ్‌కుమార్, జనార్దన్, పుల్లా శ్రీనివాస్, షఫీ, కేయూ నాయకులు కొమురయ్య, జెట్టి రాజేందర్, పిన్నింటి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### నేడు కాళోజీ సర్కిల్‌లో శాంతియుత నిరసన

హనుమకొండ చౌరస్తా, మే 30 : తెలంగాణ ప్రభుత్వం లోగోను మారుస్తుందనే అంశం పౌర సమాజంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా కాకతీయ కళాతోరణం తొలగిస్తున్నారని వస్తున్న వార్త ఓరుగల్లు ప్రజలను కలవరానికి గురిచేస్తున్నదని, దీనికి వ్యతిరేకంగా శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు బాలసముద్రంలోని కాళోజీ సర్కిల్ వేదికగా శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టార్చ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు అరవింద్ ఆర్య అన్నారు.

### ప్రజల జీవన విధానంలో భాగం



ప్రజల జీవన విధానం, సామాజిక బంధాలును నింపుకున్నది కళాతోరణం. అందులో ప్రజల ఆత్మ ఉంది. రాజుకు ప్రజలే నిజమైన సంపద అని అభయ శాసనం వేయించిన గణపతి దేవరాజు కాకతీయ తోరణాన్ని నిర్మించారు. ఇది కాకతీయ సప్త సంతాన తాత్వికతకు ప్రతీకగా నిలుస్తున్నది. ఎగుడు దిగుడు దక్కన్ పీఠభూమిలో నీటికి నడకను నేర్పి చెరువుల నిర్మాణం, తద్వారా రైతు సుభిక్షం దీనితో సమస్త కళా సంస్కృతులు వికాసం చెందాయని అనే అర్థం ఇమిడి ఉంది. కొత్త ప్రభుత్వం ప్రస్తుతం ఉనికిలో ఉన్న చిహ్నంలోని ఏ గుర్తును తొలగించవద్దు. ఇంకా ప్రజల జీవితాలను మెరుగుపరిచిన ఇతిహాసాన్ని తలపించే సమ్మక్క, సర్వాయి పాపన్న, దొడ్డి కొమురయ్య పోరాటం, తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ఫలితాలను చేర్చాలి. రాజముద్ర నుంచి చిహ్నాలు తొలగించడం సరైంది కాదు. ఆత్మగౌరవానికి తేడా వస్తే తెలంగాణ ప్రజలు ఊరుకోరు. ఉన్నది తీసేస్తే తెలంగాణ ప్రజల ఆగ్రహానికి గురవుతారు.

– అస్నాల శ్రీనివాస్, దొడ్డికొమురయ్య ఫౌండేషన్ చైర్మన్

## అర్హత లేకున్నా మూల్యాంకనం

**కాకతీయ యూనివర్సిటీ అక్రమాలకు కేంద్రంగా మారింది. పైరవీకారుల పెత్తనం నడుస్తున్నది. కీలక మైన విభాగాల్లో నిబంధనలు పాటించకపోవడంతో విశ్వవిద్యాలయం ప్రతిష్ట మసకబారుతున్నది. డిగ్రీ సెమిస్టర్ పరీక్షల వాల్యుయేషన్‌లో డెయిలీ వేజ్ సిబ్బంది పాల్గొనడం విమర్శలకు తావిస్తోంది. ఉన్నతాధికారులు సొంత ప్రయోజనాలే ధ్యేయంగా అర్హత లేని వారికి పేపర్లు దిద్దే అవకాశం ఇస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్నారు. సబ్జెక్టుపై అవగాహన లేని వారి వల్ల తాము నష్టపోవాల్సి వస్తుందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇదంతా డబ్బుల వ్యవహారంతోనే జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.**

– వరంగల్, మే 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- కేయూ ఎగ్జామినేషన్‌లో అక్రమాలు
- పైరవీలతో ఎగ్జామినర్ నియామకాలు
- తాత్కాలిక ఉద్యోగికి పేపర్ కరెక్షన్‌కు ఛాన్స్
- డెయిలీ వేజ్ సిబ్బందికి డిగ్రీ పేపర్లు దిద్దే అవకాశం
- రహస్యంగా ఆర్డర్ ఇచ్చిన ఎగ్జామినేషన్ బ్రాంచ్
- విద్యార్థుల జీవితాలతో ఉన్నతాధికారుల చెలగాటం



డిగ్రీ సెమిస్టర్ పరీక్షల వాల్యుయేషన్‌లో అక్రమార్కులు జరిగాయని ఉద్యోగులు, విద్యార్థులు ఆరోపిస్తున్నారు. లెక్చరర్‌గా అర్హత లేకున్నా యూనివర్సిటీలో పని చేసే తాత్కాలిక ఉద్యోగులు, రోజు వారీ పారితోషికంపై పనిచేసే వారికి పేపర్లు దిద్దే అవకాశం కల్పిస్తున్నారు. పేపర్లు వాల్యుయేషన్ చేసే అర్హత ఉండాలంటే.. ఏదైనా డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్‌గా పనిచేస్తూ ఉండాలి. బోర్డ్ ఆఫ్ స్టడీస్(బీవోఎస్)తో నియామకమై ఉండాలి. కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి కార్యాలయంలో జరిగే వాల్యుయేషన్ పద్ధతి మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నది. కేయూ దూర విద్య కేంద్రం(ఎస్‌డీఎల్‌సీఈ)లో రోజువారీ పారితోషికం ప్రాతిపదికన పనిచేస్తున్న ఎ.సుదయ్యకు పీహెచ్‌డీ పూర్తి చేశాడనే కారణంతో డిగ్రీ పరీక్ష పేపర్లు దిద్దే అర్హత కల్పించేలా ఎగ్జామినర్‌గా నియమిస్తూ రహస్య ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు ఎలాంటి అర్హతలు లేకున్నా, పొలిటికల్ సైన్స్ లెక్చరర్‌గా ఆర్డర్ కాపీ సిద్ధం చేసి పరీక్ష పేపర్లు దిద్దేందుకు అవకాశం కల్పించారు. ఈ ఏడాది జనవరిలో డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షలు జరిగాయి. సుదయ్యను పొలిటికల్ సైన్స్ లెక్చరర్ అని పేర్కొంటూ ఎగ్జామినర్‌గా పేపర్ వాల్యుయేషన్‌కు అనుమతి ఇచ్చారు. ఎగ్జామినేషన్‌లో బ్రాంచ్‌లో ఫిబ్రవరి 17న మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు పేపర్ వాల్యుయేషన్‌లో పాల్గొన్నాడు. ఏ కాలేజీలోనూ లెక్చరర్‌గా విధులు నిర్వర్తించని వ్యక్తికి సబ్జెక్టుపై ఎలా అవగాహన ఉంటుందని, ఇలాంటి వారి వల్ల తమ భవిష్యత్తు నష్టపోవాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. అర్హతలేని వ్యక్తితో పేపర్లు వాల్యుయేషన్ చేయించడంతో బాగా చదివిన వారు ఫెయిల్ అవుతున్నారని, నామమాత్రంగా రాసే వారికి ఎక్కువ మార్కులు వస్తున్నాయని అంటున్నారు.

**మరికొన్ని...**

కాకతీయ యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ నిర్లక్ష్యంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారుల తప్పిదంతో విద్యార్థుల భవిష్యత్‌ను ఆగం చేస్తున్నారు. గతంలో కాకతీయ యూనివర్సిటీలో ఒక విద్యార్థికి ఓ సబ్జెక్టులో 100 మార్కులకు 105 వేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మరో పేపరులో 40 మార్కులకు 43 వేశారు. గతేడాది డిగ్రీ పరీక్షలు రాసిన విద్యార్థులను మెమో ఆబ్సెంట్ అయినట్లుగా పేర్కొంటూ ఫెయిల్ అని నమోదు చేశారు. అర్హతలేని వారికి కీలకమైన బాధ్యతలు అప్పజెప్పడం వల్ల ఇలా జరుగుతున్నదని విద్యార్థులు చెబుతున్నారు. యూనివర్సిటీలో కీలక మైన విభాగాల్లో అవినీతి, అక్రమాలు పెరుగుతున్నాయని... ఉన్నతాధికారులు సొంత ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తుండడంతో విద్యార్థులు నష్టపోతున్నారు.

**పొరపాటు జరిగింది: రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి**

ఎస్డీఎల్సీఈలో సుదయ్య డెయిలీవేజ్ ఉద్యోగి. ఆయన లెక్చరర్ కాదు. బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో ఎక్కడో పొరపాటు జరిగింది. జనవరిలో జరిగిన డిగ్రీ సెమిస్టర్ వాల్యుయేషన్‌కు నేను కంట్రోలర్ నుంచి రిజిస్ట్రార్‌గా వచ్చాను. కంట్రోలర్‌గా డాక్టర్ ఎస్. నర్సింహాచారి వచ్చారు. కంప్యూటర్ బేస్డ్ సంతకం కావడంతో అతను ఆర్డర్ కాపీని చూసుకోలేదు. పూర్తిస్థాయిలో విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటాం.




హనుమకొండ బీఆర్‌ఎస్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

## బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన

హనుమకొండ/ఖిలావరంగల్, మే 30 : తెలంగాణ కీర్తి ప్రతిష్టకు చిహ్నాలైన కాకతీయ కళాతోరణం, చార్మినార్‌లను రాజ ముద్ర నుంచి తొలగించాలనే సర్కారు నిర్ణయంపై బీఆర్‌ఎస్ పార్టీ మండిపడింది. ఈ మేరకు లోగో మార్పుపై గురువారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు నల్ల బ్యాడ్జిలతో నిరస న తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్ మాట్లాడుతూ రాజముద్రలోని కాకతీయ కళాతోరణం తొలగించే నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి వెనక్కి తీసుకోవాలని అన్నారు. కాకతీయ కళాతోరణం తొలగిస్తే వరంగల్ ప్రజల మనోభావాలను దెబ్బతీసినట్లేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లోగో మార్పు నిర్ణయం వెనక్కి తీసుకోని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు నయీమొద్దీన్, నాయకులు చాగంటి రమేశ్, బొల్లు రవి, ఎండీ మహమూద్, సంపత్, ఇస్మాయిల్, సందీప్, రాజేశ్వర్, అఫ్జల్ పాల్గొన్నారు.